క్లుప్తంగా

వేధిస్తే ఫిర్యాదు చేయండి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పింజారిగుట్ట నిర్మల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, ఆన్‌లైన్ మోసాలు, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆపదలో షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం సిబ్బంది ఉన్నారు.

బీజేపీకి పలువురి రాజీనామా

ఖానాపూర్: సదర్‌మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు హపావత్ రాజేందర్‌నాయక్‌తో పాటు పలువురు నాయకులు శుక్రవారం బీజేపీకి రాజీనామా చేశారు. బీజేపీలో చేరి రైతు ఉద్యమాలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన గుర్తింపు రాలేదని రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజేశ్వర్‌రెడ్డి, పరుశురాం, నర్సింగ్, గోవింద్, బాల్, శ్రీనివాస్ పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

కుంటాల: రబీ సీజన్ కోసం రైతులకు అవసరమయ్యే శనగ విత్తనాలు కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని సీఈవో నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25 కిలోల బస్తా ధర రూ.1875కు విక్రయిస్తున్నామని.. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో వచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

పోస్టాఫీసులో ఖాతాలు తెరువాలి

లక్ష్మణచాంద: గతంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం డబ్బులు పొంది ఈసారి రాని రైతులు సమీపంలోని పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరవాలని ఏవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు పోస్టాఫీసు ఖాతాలను మీసేవా కేంద్రాలకు వెళ్లి పీఎం కిసాన్ పథకానికి శనివారంలోగా అనుసంధానం చేసుకోవాలని రైతులకు సూచించారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణంరాజు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన ఒడ్డెపల్లి కృష్ణంరాజు.. మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 25 మంది అనాథ చిన్నారులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని సొంతంగా రూ.30వేల విలువైన దస్తులను అందజేశారు. ఓకేఆర్ మిత్రబృందం ఉన్నారు.

బతుకమ్మల నిమజ్జనం

ఖానాపూర్: మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి బతుకమ్మల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. కూడళ్ల వద్ద మహిళలు ఆడిపాడారు. ఖానాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అందంగా పేర్చిన చిటికేశి ప్రవంతి, కట్కం గీతారాణి, చిటికేశి మానసలకు శుక్రవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చీరలను బహుమతులుగా అందజేశారు. జితేందర్, కిషన్, లక్ష్మి నారాయణ, సతీశ్ ఉన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

భైంసారూరల్: మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ సెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ యాజమాన్యం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత కిట్లను పంపిణీ చేసింది. శుక్రవారం పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు రూ.ఎనిమిది వేల విలువైన పేస్ట్, బ్రష్, సబ్బులు, షాంపు, బాత్‌జెల్, మాయిశ్చరైజర్, దువ్వెనతో కూడిన ఏడు రకాల వస్తువులున్న కిట్లను అందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహకారం అందిస్తామని డెక్కన్ సెరాయ్ గ్రూప్ సేల్స్ డైరెక్టర్ దత్తాత్రేయ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సంజయ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భైంసాలో దేశీదారు పట్టివేత

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో అక్రమంగా నిల్వఉంచిన మద్యంతోపాటు, మహారాష్ట్ర దేశీదారు బాటిళ్లను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి 585 దేశీదారు బాటిళ్లు, 480 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.1.14లక్షలు ఉంటుందన్నారు. ఎస్సైలు రమేశ్, ప్రణీత్, హెడ్‌కానిస్టేబుళ్ల క్రిష్ణమూర్తి, రాజేశ్వర్ ఉన్నారు.

పంట కొనేదెప్పుడో?



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గంటాగారి మహేందర్‌రెడ్డి. లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో తనకున్న ఆరు ఎకరాల్లో వానాకాలంలో వరి పంట సాగు చేశాడు. ఐదెకరాల్లో వరి కోతలు పూర్తవగా.. పది ట్రాక్టర్ల వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించి 15 రోజులవుతోంది. అప్పటినుంచి ధాన్యాన్ని కేంద్రంలోనే ఆరబెడుతూ ఉన్నాడు. అధికారులు కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో కోతకు వచ్చినా.. ఎకరం వరి పంటను అలానే ఉంచాడు.



పంచగుడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

- ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించని అధికారులు
- జిల్లాలో ముమ్మరంగా వరి కోతలు
- కేంద్రాల వద్ద అన్నదాతల పడిగాపులు



ధర్మోరలో పొలం కోస్తున్న యంత్రం

లోకేశ్వరం: ఆరుగాలం కష్టించి పని చేసే రైతులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు. జిల్లాలో వరికోతలు 15 రోజుల కిందటే ప్రారంభమయ్యాయి.. కానీ అధికారులు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ఎప్పుడు ఏ మేఘం ఉరిమి.. వర్షం రూపంలో పంటలకు నష్టం చేస్తుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఈసారి పెరగనున్న దిగుబడులు..

ప్రభుత్వం ఏ గ్రేడ్(దొడ్డురకం)ధాన్యానికి క్వింటాల్‌కు ధర రూ.2203, బీ గ్రేడ్(సన్నరకం)కు రూ.2183గా నిర్ణయించింది. జిల్లాలో ఈసారి వానాకాలంలో లక్షా 25 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఈసారి పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులు పెరుగుతాయని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు లక్షా 36వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రావొచ్చని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో గతంలో మాదిరి 220 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయలేదు. గన్నీ బ్యాగులు, తేమశాతం గుర్తించే పరికరాలు, తూకం వేసే యంత్రాలు ఎప్పుడు తెచ్చి కొనుగోళ్లు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఊపందుకున్న కోతలు..

జిల్లాలో వరి కోతలు మొదలవగా కొన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, కన్కపూర్, లోకేశ్వరం, ధర్మోర, పంచగుడి గ్రామాల్లోని రైతులు వారం రోజుల కిందటే తమ పంటలను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబెడుతున్నారు. కానీ ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు.

కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు

కోసిన పంటను నిల్వ చేసుకునేందుకు ఇళ్లల్లో, పొలాల వద్ద స్థలం లేక తక్కువ ధరలకే వ్యాపారులకు విక్రయిస్తున్నామంటూ అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు, పాలకులు జిల్లాలోని అన్ని మండలాల్లో కేంద్రాలను ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

స్పష్టత కరువు..

గత యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్ ఇంకా పూర్తి కాలేదు. మరోవైపు కొత్తగా వచ్చే ధాన్యాన్ని నిల్వ చేసేందుకు స్థలం లేదు. మిల్లింగ్ జరిగితే గానీ గోదాంలులు ఖాళీ కావు. మిల్లింగ్ జరగకపోతే కొత్తగా వచ్చిన ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలన్నది సమస్య అవుతుంది. దీంతో కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో మొదలయ్యేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ నిర్మల్‌లో మిల్లర్లతో సమావేశమై ధాన్యం మిల్లింగ్ వేగవంతం చేయాలని సూచించారు.

కేంద్రం ఏర్పాటు చేయండి



మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. పంట చేతికొచ్చి వారం రోజులైతున్న అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. రైతుల గోసను అర్థం చేసుకొని వెంటనే కొనుగోల కేంద్రం ప్రారంభించాలి. – మగ్గిడి భోజారెడ్డి, పంచగుడి

త్వరలో అన్నిచోట్ల ప్రారంభిస్తాం

జిల్లాలో వరికోతలు ప్రారంభమ్యాయి. కొన్నచోట్ల గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ పంటను తరలించారని మా దృష్టికి వచ్చింది. ముధోల్ మండలం బోరిగాంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే మిగతా చోట్ల కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– శ్రీకళ, సివిల్ సప్లయి డీఎం, నిర్మల్

దేశానికి దిక్సూచిలా తెలంగాణ

- ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిలా నిలుస్తోందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అష్ట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముధోల్ మాజీ సర్పంచ్ బోయిడి అనిల్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనులను ఆదుకోవడంలో సీఎం కేసీఆర్ ముందుంటారని పేర్కొన్నారు. అందరికీ మేలు జరిగేలా మేనిఫెస్టో రూపొందించినట్లు వివరించారు. వారి వెంట కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి ఐకే రెడ్డి

సోన్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమష్టిగా ఉంటూ పార్టీ విజయం సాధించేలా చూడాలని అన్నారు. సురేశ్‌యాదవ్, ప్రశాంత్, హరీశ్, మహేశ్, నితీశ్, నితిన్, శ్రీకాంత్, తోట సాయి, గంగాధర్, అఖిలేశ్ పాల్గొన్నారు.

బొజ్జుకు టికెట్ ఇవ్వడంపై సంబురాలు



దస్తురాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఖానాపూర్: నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదివాసీ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జును ప్రకటించడంపై ఆపార్టీ నాయకులు శుక్రవారం ఖానాపూర్‌లో సంబరాలు చేసుకున్నారు. బొజ్జు గెలుపే లక్ష్యంగా పని చేస్తామని కార్యకర్తలు పేర్కొన్నారు. నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, గంగనర్సయ్య, యూసుఫ్‌ఖాన్, తోట సత్యం, జహీర్ హైమద్, శ్రీనివాస్, షౌకత్‌పాషా, సలీంఖాన్, ముషీర్, సచిన్, మీర్జాబేగ్, అశోక్ ఉన్నారు.

దస్తురాబాద్: ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను వెడ్మ బొజ్జుకు కేటాయించడంతో శుక్రవారం మండల కేంద్రంతోపాటు రేవోజీపేట, బుట్టపూర్ గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, చుంచు భూమన్న, రాజన్న, నాగరాజు, శంకర్, సత్తన్న, నాగన్న, దశరథ్, రాజేందర్, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

నర్సాపూర్(జి): వరి పంటలను ఆకుముడత తెగులు ఆశిస్తుందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో గణేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లమాడలో వరి పొలాలను ఏఈఓ పరిశీలించారు. ఆకు ముడత పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 18.5ఎస్‌సీ 0.3మీ.లీ లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 50ఎస్‌పీ 2గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. లక్ష్మణ్, చెన్న మహేశ్, బాశెట్టి విజయ్, భూమన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మాయమాటలతో మోసం చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివిధ మండలాల యువకులు బీజేపీలో చేరారు. నిర్మల్‌రూరల్ మండలం మంత్రి స్వగ్రామం ఎల్లపెల్లి వార్డు సభ్యుడు రవి, నాయకులు నరేశ్, బాలయ్య, వెంకటి, నర్సయ్య, పెద్ద నర్సయ్య, మల్లేశ్, బి.రాజు, రమేశ్ నిర్మల్ పట్టణం మంజులాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు సుధాకర్, సారంగాపూర్ మండలం ఆలూరు మాజీ సర్పంచ్ ఇర్ల సాయన్న(విజయ్), ఇర్ల చిన్నయ్య, గుండ్ల రవి, జైశ్రీరాం యూత్ సభ్యులు జామ్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ గ్యానడి చిన్న పోతన్న, నిర్మల్ రూరల్ మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘ సభ్యులు, నిర్మల్ రూరల్ మండలం భాగ్యనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముజిగి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, న్యూ పోచంపాడ్ గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు బీజేపీలో చేరారు. వీరందరికీ మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ ఆదరణను ఓర్వలేకనే ఆరోపణలు..

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను ఓర్వలేకనే బీజేపీ అల్లర్లు సృష్టిస్తుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపిస్తున్నారని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలను స్థానిక మంత్రి ప్రలోభాలకు గురి చేసి పార్టీ మార్పించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు మహేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తారని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి, మేడిసమ్మె రాజు తదితరులు పాల్గొన్నారు.

కాషాయజెండా ఎగురవేయాలి

లోకేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల్లో ముధోల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి రామారావ్ పటేల్‌ను గెలిపించి ముధోల్ గడ్డమీద కాషాయజెండా ఎగురవేయాలని ఆ పార్టీ నాయకులు, భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో బీజేపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ.. బీఆర్ఎస్ తీరును ప్రజల్లో ఎండగట్టాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. ముధోల్ కోకన్వీనర్ సుమన్‌కుమార్, శ్రీధర్, రవీందర్‌రావు, నవీన్, భాస్కర్, ప్రవీణ్, సాయన్న, గంజాల గంగాధర్, కామన్నపటేల్, భూమన్న, ఆనంద్‌రావు, గంగాధర్, కిషన్, అనిల్, రాజశేఖర్ ఉన్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి తన సొంత ఇలాకాలో గట్టి దెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు అప్పల వంశీ మున్నురుకాపు యువజన సంఘం సభ్యులు గంజి రాజు, బండారి రాజేశ్ శుక్రవారం గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కమలం గూటికి చేరారు. ముత్యంరెడ్డి, మెడిసెమ్మ రాజు, సాదం అరవింద్, అయ్యన్న గారి రాజేందర్, వోడిసెల అర్జున్, వెంకటేశ్, అల్లం భాస్కర్, శ్రీ రామోజీ నరేశ్, సాయి, జుట్టు దినేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి పట్టం కట్టాలని ప్రచారం



మామడ: వాస్తాపూర్‌లో దివ్యారెడ్డి ప్రచారం

లోకేశ్వరం: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాస్తాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నాయకులు భుజంగ్‌రావు, కపిల్, దిగంబర్, ప్రశాంత్, రమణారెడ్డి, రాజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

తానూరు: మండలంలోని తొండాల, నంద్‌గాం, సింగన్‌గాం గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మళ్లీ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డినే గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: నిర్మల్‌లో చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కే ఓటేసి గెలిపించాలని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనకాపూర్, ధర్మారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఒస రాజేశ్వర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, జహీరుద్దీన్, నరేశ్‌రెడ్డి, ముత్తన్న, రాజేందర్, గంగారం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: చేసిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లోనూ గెలిపిస్తాయని మంత్రి ఐకేరెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాస్తాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయంలో పూజల అనంతరం ఇంటింటా తిరుగుతూ ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, గంగారెడ్డి, రాందాస్, సంతోష్, వికాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ప్రజలే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారు'

సోన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహినొద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు సాయం నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు

ముధోల్: శాంతిభద్రతల పరిరక్షణకు మండల కేంద్రంలో శుక్రవారం పోలీసు బలగాల కవాతు నిర్వహించినట్లు సీఐ వినోద్‌రెడ్డి తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఓటర్లకు సూచించారు. వీధుల్లో 200 మంది సిబ్బంది ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

ఖానాపూర్: త్వరలో జరిగే ఎన్నికల్లో బందోబస్తు నిమిత్తం ప్రత్యేక బలగాల ఆవాసం కోసం కేటాయించిన పట్టణంలోని మినీస్టేడియంతోపాటు బంజారా భవన్‌ను శుక్రవారం ఖానాపూర్ సీఐ మోహన్ పరిశీలించారు. ప్రత్యేక బలగాలకు అన్ని వసతులు కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వండి'



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని,.. కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నర్సాపూర్(జి)మండలం టెంబుర్ని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని శ్రీహరిరావు పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అధికారం కోసం ఏమైనా చేస్తాడని, వాడుకుని వదిలేయడం ఆయన నైజం అని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో గ్రామాలలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందన్నారు.

లక్ష్మణచాంద: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అమ్మవారి ఆలయంలో పూజల అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అట్ల రవీందర్‌రెడ్డి, నాగేశ్, ఈటెల శ్రీనివాస్, సురేశ్, గంగయ్య, భూమేశ్, లింగన్న, మహిపాల్, భీమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓడిపోతామనే దుష్ప్రచారం..

ఖానాపూర్: ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తోందని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తల్లా పని చేస్తున్న రిటైర్డ్ అధికారులను ప్రభుత్వ బాధ్యతల నుంచి తప్పించాలని కోరితే..రైతుబంధు సాయాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. షబ్బీర్ పాషా, నిమ్మల రమేశ్, యూసుఫ్‌ఖాన్, గంగనర్సయ్య, జహీర్ అహ్మద్, తోట సత్యం, సలీంఖాన్, షౌకత్‌పాషా, సచిన్, కొండ నారాయణ, ముషీర్, మీర్జాబేగ్, లక్ష్మిరాజం, జహీర్, సజ్జు, శ్రీనివాస్, యూనిస్, సాయి తేజ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వినూత్న ప్రచారం



లోకేశ్వరం: వాస్తాపూర్ శివారు పత్తి చేనులో కూలీలను ఓట్లు అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు



లక్ష్మణచాంద: కనకాపూర్‌లో టిఫిన్ సెంటర్‌లో పూరీలు చేస్తున్న సురేందర్‌రెడ్డి

లోకేశ్వరం/లక్ష్మణచాంద: ఎన్నికలు వచ్చాయంటే ఓటర్లు దేవుళ్లవుతారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు వివిధ మార్గాలను యత్నిస్తుంటారు. శుక్రవారం లోకేశ్వరం మండలంలోని వాస్తాపూర్ శివారులో పత్తి చేనులో కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్‌కే ఓటేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్, ఆ పార్టీ నాయకులు కోరారు. లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో మంత్రి ఐకే రెడ్డి సోదరుడు సురేందర్‌రెడ్డి ఓ టిఫిన్ సెంటర్‌లో పూరీలు కాలుస్తూ మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించాలని అక్కడకు వచ్చిన వారిని కోరారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, కృష్ణారెడ్డి, వెంకటరాజు, ముత్తన్న ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు

కుంటాల: మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ముగిశాయి. చివరిరోజైన శుక్రవారం తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. మహిళలు, చిన్నారులు కోలాటం వే స్తూ ఆడిపాడారు. అనంతరం సమీపంలోని నీటికుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899